అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం అభినయ కూచిపూడి కళా క్షేత్రం పావని శ్రీలత శిష్య బృందం నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది .ప్రణవాకారం, నమశ్శివాయతేయ్, రామాయణ శబ్దం, జతిస్వరం, ఆలోకయే కృష్ణం కలియసఖి, మొదలైన అంశాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు. కార్యక్రమంలో కళాకారులు శ్రావ్య రాజేశ్వరి, నాగావళి, సుష్మ, సౌమ్య ప్రణవి, శ్రీదీత్య, సరయూ, ప్రగ్య, సంజన, అనన్య తదితరుల పాల్గొన్నారు.

పీటీడబ్ల్యూ నూతన కేలండర్ ఆవిష్కరణ



సాక్షి,సిటీబ్యూరో: ఫిజిక్స్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను సెంట్రల్ యూనివర్సిటీ ఫిజిక్స్ ప్రొఫెసర్ ఎస్ శ్రీనాథ్ ఆవిష్కరించారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ అతిథిగృహంలో జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు, కార్యదర్శి వరలక్ష్మి, జహంగీర్, ప్రొఫెసర్ శ్రీనివాస్, డాక్టర్ ఉపేందర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హాకర్ కుటుంబానికి ఆర్థికసాయం



మల్కాజిగిరి: గుండెపోటుతో మృతి చెందిన హాకర్ కుటుంబానికి మల్కాజిగిరి హాకర్స్ అసోషియేషన్ చేయూత అందించింది. ఇంటింటికి న్యూస్ పేపర్ పంపిణీ చేసే కలవల ధన్‌రాజ్(51) ఇటీవల గుండె పోటుతో మృతి చెందాడు. ఆదివారం అసోషియేషన్ తరుపున రూ. 24 వేలు ధన్‌రాజ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా అసోషియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ధన్‌రాజ్ పిల్లల చదువుకు చేయూత అందిస్తామన్నారు. కార్యక్రమంలో అనంతయ్య, శ్రీకాంత్, రాజు, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి



మహనీయులకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

మల్లాపూర్: మహనీయులైన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ నేతలు అన్నారు.ఆదివారం నాచారం ఎర్రకుంట కాలనీ మహనీయుల విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో మాలధారణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ హెచ్‌ఆర్.మోహన్, నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండారం శ్రీకాంత్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు కృష్ణారెడ్డి, బండారి రఘు, మహేష్‌యాదవ్, రాజు, గద్ద క్రాంతి. సునీల్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సదా నందం, టోనీ, ప్రవీణ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలు



సాయి జెన్‌శేఖర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కేటీఆర్, బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: గ్రేటర్ బీఆర్ఎస్ నేత సాయి జెన్‌శేఖర్ జన్మదిన వేడుకలు ఆదివారం నాచారంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా యాదేఫ్రాజిల్ ఉర్సు ఉత్సవాలు



ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: నేరేడ్‌మెట్ డివిజన్, యాప్రాల్‌లోని అప్పగారి ఆశ్రమంలో రెండు రోజులుగా జరుగుతున్న యాదేఫాజిల్ దర్గా హజ్రత్, ఉర్స్-ఈ-షరీఫ్ ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. కార్యక్రమంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ భద్రారెడ్డి, కార్పొరేటర్ సబితా అనిల్‌కిశోర్, ఉపేందర్‌రెడ్డితో పాటు దర్గా నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ చాంపియన్‌గా వీబీఐటీ జట్టు

ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో నిర్వహించిన బౌట్-2024 జాతీయ స్థాయి క్రీడల్లో వాలీబాల్ విభాగంలో అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల పురుషుల జట్టు విజేతగా నిలిచింది. ముఖ్య అతిథిగా హాజరైన చెస్ గ్రాండ్ మాస్టర్ ప్రత్యూష ఆదివారం విజేతలకు షీల్డ్, సర్టిఫికెట్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ బాలాజీ, వీబీఐటీ పీడీ శ్రీనివాస్‌రెడ్డి, పలు కళాశాలల పీడీలు, యూనివర్సిటీ అధ్యాపకులు పాల్గొన్నారు .

రంగుమారిన నీళ్లు



తుమ్మ చెరువు



అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు



కంపు కొడుతున్న తుమ్మ చెరువు

- దుర్గంధంతో కాలనీల వాసుల అవస్థలు
- డంపింగ్‌యార్డుగా మారుతున్నా పట్టించుకోని అధికారులు
- రంగు మారుతున్న నీళ్లు



తుమ్మ చెరువులో చెత్త

మేడ్చల్: పట్టణంలోని తుమ్మ చెరువులో సమీప కాలనీలవాసులు వ్యర్థాలు, చెత్తను ఇష్టానుసారంగా పడేస్తుండటంతో చెరువు పరిసరాలు డంపింగ్ యార్డును తలపిస్తున్నాయి. చెరువు పైభాగంలో ఉన్న ఇళ్ల నుంచి డ్రైనేజీ నీరు నేరుగా చెరువులోకి వచ్చి చేరుతుండటంతో తుమ్మ చెరువు కంపు కొడుతుంది. ఆర్టీసీ కాలనీ, వినాయక్ నగర్ కాలనీ పై భాగంలో సూర్యనగర్, మల్లికార్జున నగర్, రైల్వే స్టేషన్ కాలనీ ,హౌజింగ్ బోర్డు కాలనీ, ఇందిరానగర్, బ్యాంక్ కాలనీ, సాయిబాబా గుడి కాలనీల సమీపంలో ఉన్న తుమ్మ చెరువు పట్టణ ప్రజల భూగర్భ నీరు అందించడంలో ప్రధాన ఆధారంగా ఉంది. అధికారులు, పాలకులు పలుమార్లు చెరువును శుభ్రం చేయిస్తున్నా కాలనీల వాసులు తమ ఇళ్ల నుండి వచ్చే వ్యర్థాలు, చెత్తను చెరువు గట్లపై పడేస్తుండటంతో చెరువు కాలుష్యకాసారంగా మారుతోంది. తద్వారా దుర్గంధంతో పాటు దోమలు పెరుగుతున్నాయి. దీంతో సమీప కాలనీల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తా చెదారం, మురికి నీటి కారణంగా చెరువులో నీరు రంగు మారుతోంది. కట్టపై, చెరువులో చెత్త వేస్తే రూ.500 జరిమానా విధిస్తామని మున్సిపల్ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా పట్టించుకునేవారు కరువయ్యారు.

ముక్కు మూసుకోవాల్సిందే..

చెరువు పూర్తిగా కలుషితం కావడంతో నీరు రంగు మారింది. చెరువు కట్టపై సీసీ రోడ్డు వేసి అభివృద్ధి చేయడంతో వాకింగ్, వాహనాల రాకపోకలకు అనువుగా మారినా దుర్గంధం కారణంగా కట్టపై నడవాలంటే ఇబ్బందికరంగా ఉంది. రంగు మారుతున్న నీటితో భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఏర్పడింది.

అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది..

తుమ్మ చెరువును శుభ్రం చేసి మంచినీరు నింపాలని ప్రతిపాదనలు చేసినా కలుషిత నీరు బయటకు పంపే మార్గాలు లేకపోవడంతో అది ఆచరణకు నోచుకోవడం లేదు. ఏటా వర్షాకాలంలో చెరువు పూర్తిగా నిండి ప్రమాద స్థాయికి చేరి ఎప్పుడు కట్ట తెగుతుందోనని సమీప కాలనీల ప్రజలు భయపడుతున్నారు. చెరువు నీటిని బయటకు పంపి చెరువును సుందరీకరిస్తామని ఎమ్మెల్యే మల్లారెడ్డి, మున్సిపల్ అధికారులు పలు మార్లు హామీలు ఇచ్చినా ఆచరణకు నోచుకోలేదు. గతంలో ఇంజినీరింగ్ అధికారులు చెరువులో నీరు పల్లపు ప్రాంతాల నుండి వెళ్లేందుకు పైప్ లైన్ నిర్మాణం చేయాలని, మురుగు నీరు చెరువులో కలవకుండా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదనలు రూపొందించినా అమలుకు నోచుకోలేదు. ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి.

సుందరీకరణ పనులు చేపట్టాలి

తుమ్మ చెరువు సగం పాత మేడ్చల్ వైపు, మిగతా సగం కాలనీల వైపు ఉంది. చెరువును సుందరీకరించి కట్టపై ఫుట్ పాత్‌లు నిర్మించి, బెంచీలు ఏర్పాటు చేసి, ఆహ్లాదకర వాతావరణం కల్పించాలి. ఐదుగురు కౌన్సిలర్ల పరిధిలోకి వచ్చే చెరువును అభివృద్ధి చేస్తే పర్యాటక కేంద్రంగా ప్రాధాన్యం వస్తుంది.

'10 నిమిషాల'పై పునఃపరిశీలించాలి

మల్కాజిగిరి: రైలు ప్రయాణికులు రైలు బయలుదేరిన 10 నిమిషాల్లో బెర్త్ (సీట్)లో ఉండాలన్న నిర్ణయం తగదని, దీనిపై పునఃపరిశీలించాలని డీఆర్‌యూసీసీ మెంబర్, ట్రావెలర్స్ అసోషియేషన్ కార్యదర్శి నూర్ డిమాండ్ చేశారు. ఇప్పటికీ చాలా స్టేషన్లలో రైలు కోచ్ నెంబర్లు తెలియజేసే ఎల్రక్టానిక్ డిస్‌ప్లే బోర్డులు లేవన్నారు. మరికొన్ని సార్లు రైలు బోగీల నెంబర్లు గందరగోళంగా ఉంటాయన్నారు. నిమిషం లేదా రెండు నిమిషాల్లో హాల్టింగ్ ఉండే స్టేషన్లలో ప్యాసింజర్లు రైలు ఎక్కడానికి చాలా ఇబ్బందులు పడుతారని వేరే బోగీల్లో ఎక్కి వారు రిజర్వేషన్ చేసుకున్న బోగీలోకి చేరుకుంటారన్నారు. పది నిమిషాల నిబంధనను వెనక్కి తీసుకుని కనీసం అరగంట ఉండేలా రైల్వే మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకోవాలన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో ప్రజలకు ప్లాస్టిక్ నిషేధంపై ఆదివారం మార్నింగ్ వాక్‌లో మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ఎవరూ వినియోగించవద్దన్నారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు బదులుగా జనపనార సంచులను వాడాలన్నారు. అనంతరం దోమల నివారణ కోసం చెరువులతో పాటు కుంటల్లో ఆయిల్ బాల్స్ చల్లారు. కార్యక్రమంలో కమిషనర్ వేమనరెడ్డి, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ వాణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సాయి తేజ, సూపర్‌వైజర్లు గాంధారి అశోక్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



కంటి పరీక్షలు చేయించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

అల్వాల్: ప్రతి ఒక్కరు నేత్రాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. ఆదివారం అల్వాల్‌లో ఏర్పాటు చేసిన ఐ ల్యాండ్ కంటి ఆసుపత్రిని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించి ఆసుపత్రికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. ఆసుపత్రి నిర్వాహకులు నీలాంబరరావు, డాక్టర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ ఆసుపత్రిలో అన్ని రకాల కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామన్నారు. ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన సేవలందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మచ్చబొల్లారం డివిజన్ కార్పొరేటర్ జితేంద్రనాథ్, అల్వాల్ కాంగ్రెస్ పార్టీ నేతలు నిమ్మ అశోక్‌రెడ్డి, రాజసింహారెడ్డి, బొబ్బిలి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మశ్చేందర్‌కు ఘన నివాళి



అల్వాల్: బడుగు, బలహీనవర్గాలకు మాజీ ఎమ్మెల్యే మశ్చేందరావు అందించిన సేవలు ఎనలేనివని పలువురు నేతలు అన్నారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే మశ్చేందర్ రావు దశదిన కర్మ కార్యక్రమం అల్వాల్‌లో జరిగింది. కుంటుంబ సభ్యులతో పాటు పలువురు నేతలు హాజరయ్యారు. ఆయన బడుగు బలహీన వర్గాలకు చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. మాజీ మున్సిపల్ చైర్మన్ జీవకన్, మాధవన్‌తోపాటు ఆయన కుమార్తెలు సంధ్య, శబరి, మనుమళ్లు గౌరీ శంకర్, మోహన్‌కృష్ణ, దయాకర్, కొమురయ్య, రవి, చారీ తదితరులు పాల్గొన్నారు.

రక్త దానం ప్రాణదానంతో సమానం

బోడుప్పల్: రక్త దానం ప్రాణదానంతో సమానమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. చెంగిచర్లలో రాసాల మల్లేష్ యాదవ్ జ్ఞాపకార్థం 'మా నాన్న ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్త దాన శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని దానాల్లో రక్త దానం గొప్పదన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆరోగ్యవంతులుగా ఉండేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్, కొత్త చందర్‌గౌడ్, రాసాల వెంకటేశ్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త సుశాంత్‌గౌడ్, మేడ్చల్ నియోజక వర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ , ఫౌండేషన్ నిర్వాహకు లు రాసాల కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



నాచారంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. ఆదివారం నాచారం హెచ్ఎంటీనగర్‌లో డాక్టర్ గుణాస్ డయాగ్నస్టిక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ శాంతి సాయి జెన్‌శేఖర్ ప్రారంభించారు. వైద్య పరీక్షల అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు గుణభగవంత్‌రెడ్డి, నందకిషోర్. ప్రవీణ్‌కుమార్, వీరుమారి, వికాస్, భార్గవి. కావ్య, హెచ్ఎంటీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జీనియా ఆస్పత్రి సౌజన్యంతో..



మల్లాపూర్‌లో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సీఐ నందీశ్వర్‌రెడ్డి

మల్లాపూర్ గుల్మోర్ గార్డెన్స్ అపార్ట్‌మెంట్స్‌లో ఆదివారం జీనియా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. నాచారం ఇన్‌స్పెక్టర్ నందీశ్వర్‌రెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటయ్య, గుల్మోర్ గార్డెన్స్ అపార్ట్‌మెంట్ అధ్యక్షులు ఎస్వీ కిట్టు, రాజ్‌కుమార్ తది తరులు పాల్గొన్నారు.

మళ్లీ ఎన్నికల బదిలీలు..!

- పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియలు పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు
- మూడేళ్ల సర్వీసు పూర్తయిన పంచాయతీ రాజ్, జెడ్పీ, డీఆర్‌డీఏ ఉద్యోగుల బదిలీపై చర్చ
- ఎంపీడీఓలకు కూడా బదిలీలు తప్పవని సమాచారం
- బదిలీపై శివారు జిల్లాల అధికార యంత్రాంగం కసరత్తు

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అధికారుల బదిలీలకు మరోసారి రంగం సిద్ధమవుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న రెవెన్యూ, పోలీసు, పంచాయతీ రాజ్ విభాగాల్లో బదిలీలు జరిగాయి. మరో వైపు సర్వీసుతో సంబంధం లేకుండా సొంత జిల్లాలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు కూడా బదిలీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మరోసారి అధికారుల బదిలీల అంశం తెరపైకి వచ్చింది. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసుకుని సిద్ధంగా ఉండాలని సూచించడంతో... బదిలీల ప్రక్రియను వేగవంతం చేసేందుకు అధికార యంత్రాంగం సమాచారాన్ని సేకరిస్తోంది. అందులో భాగంగానే జిల్లా పంచాయతీ, జిల్లా పరిషత్, డీఆర్డీఏ విభాగాల్లో పనిచేస్తున్న జిల్లా అధికారులతో పాటు మరికొన్ని విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు బదిలీ అయ్యే అవకాశాలు ఉన్నాయని రెవెన్యూ శాఖ వర్గాల్లో చర్చ సాగుతోంది. సదరు అధికారుల స్వస్థలం, ఎన్ని సంవత్సరాలుగా మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో పనిచేస్తున్నారు.ఉద్యోగ విరమణకు దగ్గరగా ఎవరైనా ఉన్నారా? లాంటి వివరాలను సేకరించి తుది నిర్ణయం తీసుకోనున్నారు.

మినహాయింపు దక్కేనా..

కలెక్టరేట్‌లలోని వివిధ విభాగాలకు పర్యవేక్షకులుగా తహసీల్దార్లు పనిచేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కొందరు బదిలీపై ఇక్కడి వచ్చారు. ఇక జిల్లాల్లో ఆయా మండలాల్లో ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారు బాధ్యతల్లో కొనసాగుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మండల అభివృద్ధి అధికారులు (ఎంపీడీవో)లకు పోలింగ్ నిర్వహణలో ప్రత్యక్ష ప్రమేయం ఉండే అవకాశాలు లేకపోవడంతో వీరికి బదిలీల నుంచి మినహాయింపు లభించింది. కానీ సొంత జిల్లా, మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఎంపీడీవోలను కూడా ఈ దఫా బదిలీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల నిర్వహణలో అనుభవజ్ఞులైన అధికారుల అవసరం ఉంటుందన్న కారణంగా జిల్లాల్లో కొంత మంది అధికారులకు మినహాయింపు కూడా దక్కవచ్చని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ముగ్దూం మొహిద్దీన్ సేవలు ఎనలేనివి

కాప్రా: తెలంగాణ సాయుధ పోరాట యోధులు, కవి, రచయిత ముగ్దూం మొహిద్దీన్ సేవలు ఎనలేనివని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం ముగ్దూం మొహిద్దీన్ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి ఆధ్వర్యంలో కమలానగర్‌లోని ఎన్వీ భాస్కర్‌రావు భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోమటి రవి, గొడుగు యాదగిరిరావు, శ్రీమన్నరాయణ, గగన్‌కుమార్, శారద, శ్రవణ్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

ఘట్‌కేసర్: పట్టణంలోని బాలాజీనగర్ శ్రీ మహంకాళమ్మ, శ్రీ పోచమ్మ, శ్రీ మైసమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, స్థానిక కౌన్సిలర్ నర్సింగ్‌రావుతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోనాలు పండుగకు ఆలయాలను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు ఆంజనేయులు ముదిరాజ్, వెంకటేశ్, రమేశ్‌ముదిరాజ్, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

మారుతీనగర్ కాలనీ అసోసియేషన్ ఎన్నిక

ఘట్‌కేసర్: పట్టణంలోని శివారెడ్డిగూడ మారుతీ నగర్ కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, స్థానిక కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్ నూతన కమిటీ సభ్యులను శాలువాతో సత్కరించి అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా దయాకర్, ఉపాధ్యక్షులుగా భిక్షపతి, రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా అశోక్, సంయుక్త కార్యదర్శులుగా రాజ్‌కుమార్, సంజీవముదిరాజ్, కోశాధికారిగా ప్రవీణ్‌కుమార్, సలహాదారులుగా వెంకటేశ్వర్‌రావు, శ్రీనుయాదవ్ ఎన్నికయ్యారు.

కమనీయం...మల్లన్న కల్యాణం



బోనాలు సమర్పిస్తున్న భక్తులు



పాల్గొన్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

గౌతంనగర్: మల్లికార్జుననగర్‌లోని మల్లన్న దేవాలయంలో ఆదివారం మల్కాజిగిరి శ్రీ క్రిష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లన్న స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, బోనాల జాతర, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్‌తోపాటు వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మల్లాపూర్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నాచారం ఇన్‌స్పెక్టర్ నందీశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సైబర్ నేరాలపై మల్లాపూర్ గుల్మోర్ గార్డెన్స్ అపార్ట్‌మెంట్ వాసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌లో వచ్చే మేసేజ్‌లు, లింక్‌లు అనవసరంగా ఓపెన్ చేయొద్దన్నారు. ఎవరికీ ఓటీపీలను చెప్పరాదన్నారు. సైబర్ నేరగాళ్ల కారణంగా మోసంపోతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. అనుమానాస్పందంగా వ్యక్తులు తిరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ. వెంకటయ్య, గుల్మోర్ గార్డెన్స్ అపార్ట్‌మెంట్ అధ్యక్షులు ఎస్వీ కిట్టు, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, సిద్దర్థ్, వివేక్, శశిమోహన్, సాయి, ఠాగూర్, లక్ష్మణ్, లక్ష్మి, దీపిక, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాచారం ఇన్‌స్పెక్టర్ నందీశ్వర్‌రెడ్డి